International Journal of Academic Research
ISSN: 2348-7666 Vol.2, Issue-2(4) (Special), April-June, 2015

# గుర్రం జాషువా జీవితం - రచనలు

**డా॥ దోనెంపూడి నారాయణరావు**
**తెలుగు ఉపన్యాసకులు**
**శ్రీ అనంత పద్మనాభ కళాశాల,**
**వికారాబాద్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణా -501101**

"కవినిగన్నతల్లి గర్భంబుధన్యంబు / కృతిని, జెందువాడు మృతుడుగాడు / పెరుగుతోటకూర విఖ్యాత పురుషులు / కవిని వ్యర్థ జీవిగా దలంత్రు" అని ఫిరదౌసి కావ్యంలో, "రాజు మరణించెనొకతార రాలిపోయె / కవియుమరణించెనొక తారగగనమెక్కె / రాజుజీవించెఱాతి విగ్రహములందు / సుకవి జీవించె ప్రజలనాలుకలయందు" అంటూ "కొత్తలోకం' కావ్యంలో సమాజంలో కవులకుగల స్థానాన్ని తను చెప్పిన మాటలకు సార్థకంబుగా, ధన్యజీవిగా, ప్రజల నాల్కలపై తెలుగు జాతి ఈ భూమిమీద మనగలిగేవరకు జీవించే విశ్వకవిగా 'గుర్రం జాషువా' కవి జీవించారు.

జాషువాకవి సాహిత్య సామాజిక దృక్పథాన్ని అర్థంచేసుకోవాలంటే ఆయన పుట్టి,పెరిగిన, జీవితంలో ఎదురైన అనుభవాలు, అవమానాలు, వేదనలు దుర్భరదారిద్ర్యం అప్పటి వరకు తెలుగుసాహిత్యాన్ని సృష్టించిన తెలుగు కవులకంటే భిన్నమైన అస్పృశ్యతా జీవితం తెలుసుకోవాలి.

తల్లిగర్భంలో పడ్డపుడే నిర్ణయించిన అంటరాని కుల దురహంకారం, అణచివేత భయంకరమైన కుల వ్యవస్థ నాల్గు పడగలతో బుసలుగొట్టి ఆయన ఎదుగుదలని, ప్రజ్ఞని అడ్డుకోవడం, అయినా ఈ అవమానాలకు కుంగిపోకుండా ఎదిరించే తత్వం అలవాటయ్యింది. జీవకారుణ్యం, హేతువాద మానవతా వాదిగా ఎదిగి విశ్వనరునిగా తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకున్న సమున్నత మహాకవిగా జాషువాకవి కనిపిస్తారు.

**బాల్యం – విద్యాభ్యాసం :–** గుర్రంజాషువా సెప్టెంబరు 28, 1895న గుంటూరు జిల్లా, వినుకొండలోని మిస్సమ్మ తోటలో గుర్రం వీరయ్య, లింగమ్మ దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించారు. తనకు ముందు చాలామంది చనిపోగా పుట్టినవాడు కాబట్టి గారాబంగా పెంచారు.

గుర్రం వీరయ్య హిందూ సంఘంలో యాదవ కులానికి చెందినవాడు, లింగమ్మ మాదిగ కులానికి చెందింది. చదువుకోవాలని వచ్చి లింగమ్మను ప్రేమించి క్రైస్తవాన్ని స్వీకరించి రెండు కులాలను ఎదిరించి కులాలంతర వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని సమాజం అంగీకరించలేదు, వెలివేసారు. తండ్రి శూద్రకులస్థుడైనా క్రైస్తవం స్వీకరించినా, అంటరానివానిగానే ఈ సమాజం జాషువాని గుర్తించింది. తల్లినుండి ఈ అస్పృశ్యతను వారసత్వంగా పొందారు. వీరయ్య, లింగమ్మలు క్రైస్తవ మత బోధకుల శిక్షణ తీసుకొని పాస్టర్లుగా స్థిరపడ్డారు. తల్లిగారబం వల్ల అల్లరి వానిగా ఎదిగినా నీతి, సద్వర్తనంతో అవసరమైనంతమేరకు దండిస్తూ యోగ్యునిగా తీర్చారు. దుర్భర దారిద్ర్యం ఒకవైపు, తండ్రి నుండి గొల్లసుద్దుల ద్వారా జానపద సాహిత్య పరిమళంతో ఎదిగారు.

జాషువా బాల్యం వినుకొండలో ఆటపాటలతో గడిచింది. మిషనరీ స్కూల్లో ప్రాథమికవిద్య 'గురవమ్మ' పంతులమ్మ వద్ద జరిగింది. (1906–1910) ఆరవ తరగతి నుండి పదోతరగతి వరకు వినుకొండలోని 'హిందూ పాఠశాల'లో సవర్ణ హిందువులు మధ్య, అంటరానితనంతో సాగింది. ఆటలు, బొమ్మలుగీయడంలో ఆసక్తి ఎక్కువ. విద్యార్థుల్లో కూడా అంటుముట్టు ఉండటం, అదేకారణంతో నాటకాలనికూడా చూడనివ్వకపోవడం మధ్య ఉన్నత పాఠశాల విద్య ముగిసింది. తను ఎదిగే క్రమంలో దేశభక్తి ఆయన్ని బ్రిటీష్‌వారిని అసహ్యించేట్లు చేసింది. విద్యార్థి దశలోనే ఆరోజుల్లో అవధానాలు, నాటకరంగప్రభావం, పద్యకవిత్వం ఆకర్షించింది. పద్యకవిగా ఎదిగి శాసించేట్లు చేసింది.

ఆయన కవిగా ఎదగడానికి వినుకొండలోని ఒకే ఒక పండితుడు, శతావధాని జూపూడి హనుమచ్ఛాస్త్రి కాళిదాసు సంస్కృత మహాకావ్యత్రయం రఘువంశం, మేఘసందేశం వంటి వాటిని బోధించారని ఆపునాదుల పైన తను హిందూ పురాణ ఇతిహాసాలు అధ్యయనం చేసినట్లు చెప్పుకున్నారు. దీపాల పిచ్చయ్యశాస్త్రితో కలసి జంటకవిత్వం చెప్పాలనుకున్నా పిచ్చి జాషువా, జాషువా పిచ్చిగా పేర్లే కలుపలేదు. తన తమ్ముడు ఇస్రాయేలుతో నేత్రావధానం చేసాడు.

బాపట్లలోని 'అమెరికన్' బాప్టిస్టు మిషన్ హయ్యర్ టీచర్ ట్రైనింగ్ స్కూల్‌లో ఉపాధ్యాయ శిక్షణ పొందాడు. ఉభయభాషా ప్రవీణ పూర్తి చేసారు.

బతుకుదెరువుకోసం 'చాట్రగడ్డపాడు'లో మిషనరీస్కూలు టీచరుగా వృత్తి జీవితం ప్రారంభించారు. 1910లో తన మేనమామ కూతురు 'మేరి'తో వివాహమయ్యింది. అంటరానివానిగా సమాజం వెలివేస్తే, హిందూ పురాణాలు చదువుతున్నాడని క్రైస్తవులు వెలివేసారు. వినుకొండ దగ్గర పాడుబడ్డ మసీదులో గుడ్డి వెలుగులో సాహిత్యాన్ని చదివి కవిగా ఎదిగాడు. కనపడ్డ ప్రతి పద్య కావ్యాన్ని కనిపించిన

ప్రతి పద్యకవితో స్నేహం చేసాను అంటారు. కవిగా ఎదగడానికి దీక్షగా కృషిచేసారు. ఉద్యోగ వేటలో రాజమండ్రి చేరి కందుకూరి, చిలకమర్తి, ఆశీస్సులు పొంది 'చింతామణి' నాటక సమాజానికి 'రుక్మిణి కళ్యాణం' (1920), మదాలస పద్యనాటకాలు రాసిచ్చారు. ఒక సంవత్సరం మూకీ సినిమాలకు వ్యాఖ్యాతగా కోటిలింగాల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసారు.

1919లో గుంటూరులో హయ్యర్ గ్రేడు ఉపాధ్యాయ శిక్షణ పాఠశాలలో తెలుగు పండితునిగా ఎనిమిది సంవత్సరాలు పనిచేసారు. అలాగే 1928 సంవత్సరం వరకు బాపట్ల హైస్కూలులో, 1942 వరకు వినుకొండలో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. న్యాయవాది, కనిగిరి తాలూకా బోర్డు అధ్యక్షులు సానెకొమ్ము మాలకొండారెడ్డి సిఫారసుతో 1942-1945 మధ్య యుద్ధ ప్రచార శాఖలోనూ, 1957-1959 మధ్య ఏ.ఐ.ఆర్. మద్రాసు రేడియోలో స్పోకెన్ వార్డ్ ప్రొడ్యూసర్‌గా పనిచేసారు. 1956లో 'మేరి' గారు మరణించారు. వీరికి ముగ్గురు కూతుళ్ళు. కాంతామణి, పద్మిణి, హేమలతా దేవి, ఇద్దరు కొడుకులు పద్మనాభుడు, వలరాజు సంతానం. 1961లో విమలమ్మతో రెండో పెళ్ళి, 1964లో శాసనమండలి సభ్యులు, జూలై 24,1971నాడు మరణించారు.

**సన్మానాలు-బిరుదులు :-** కవితాభిమానులు, సాహితీ సంస్థలచే వేయికి పైగా సన్మానాలు, పగటి దివిటీలతో గజరోహణం, గండపెండారం. పాదాలకు తొడిగి గౌరవించారు. కవికోకిల, కవితావిశారద, కవిదిగ్గజ, మధుర శ్రీనాథ, నవయుగకవి చక్రవర్తి, విశ్వకవి సామ్రాట్, బిరుదులు పొందారు. గుంటూరు పట్టణం స్వేచ్ఛా పౌరసత్వమిచ్చి గౌరవించింది.

కేంద్రసాహిత్య అకాడమి 'క్రీస్తు చరిత్ర' కావ్యానికి అవార్డువచ్చింది. ఆంధ్రవిశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి సన్మానించింది. భారతప్రభుత్వం "పద్మభూషణ్"నిచ్చి సత్కరించింది.

**ఆధునిక తెలుగు సాహిత్యంలో-జాషువాకవి స్థానం:-** మహాకవి జాషువా 20వ శతాబ్దపు తెలుగుసాహిత్యంలో సుస్థిర స్థానం సంపాదించుకున్న విశిష్టకవి. ఆయన ఏ వస్తువు తీసుకొని రాసిన తనదైన సొంతగొంతుక వినిపిస్తుంది. ఆయన నిలువెల్ల కవి, పద్యకవి. వైవిధ్యం, వైరుధ్యాలను దాల్చినవాడు. తెలుగుపద్యానికి ప్రాణప్రతిష్టచేసి, పద్యానికి పదునుపెట్టి సామాజిక ప్రయోజనంకోసం వాడుకున్నాడు. ఆయన కవిత్వం చైతన్యవంతమైంది. అది సమసమాజ భావజాలానికి దగ్గరగా ఉంటుంది. మనిషిని ఔన్నత్యం వైపు నడిపించింది, అసమానతలను తొలగించి మానవసమాజం సౌభాగ్యవంతంగా, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించింది. ఆయన ధనం, అధికార పెత్తనం నిరసించాడు. ధనం సమాజపరం కావాలని ఆశించాడు. మానవ కళ్యాణాన్ని, పీడిత, తాడిత, శోషిత జనోద్ధరణకోసం, ప్రకృతిలోని ప్రతి జీవి జీవించేహక్కుకోసం కవిత్వరూపంలో తపించాడు. అట్టడుగు వ్యక్తుల ఆర్తికి, ఆవేదనతో ఆవేశంతో అక్షరరూపమిచ్చాడు.

ఈ ఇరవయ్యోశతాబ్దపు సాంఘిక, ఆర్థిక, రాజకీయాల ప్రభావం బలంగా ఉన్నకవి గుర్రంజాషువా. అనంతమైన ఆర్ధ్రత, అపారమైన భావుకత కలగలసిన మానవీయకవి. ప్రకృతి అందాలను కవిత్వీకరించడంలో, వర్ణించే వస్తువుతో తానుమమేకమై ఎవరూ ఊహించని భావుకతను వ్యక్తీకరించాడు. తనపై కవిత్రయంలో తిక్కన, శ్రీనాథ, పెద్దనల ప్రభావం స్వీయకథలో చెప్పుకున్నారు. ఆయన పద ప్రయోగం విలక్షణమైనది. ఎంచుకునే శబ్దాలకు ప్రత్యేకత ఉంది. తెలుగునుడికారం, లోకోక్తులు, సంస్కృత శబ్దాలు సందర్భశుద్ధితో కొత్తకాంతితో భాసిస్తాయి.

ఛందోస్సు, పద్యకవితలో సంప్రదాయవాదిగా ఉన్నా వాటికి కొత్త ముస్తాబులుచేసి, సరికొత్త వస్తువు, ఆధునిక దృష్టి సాధించిన ప్రయోగమది, పద్యనిర్మాణ శిల్పి, పద్యాన్ని కవితా ప్రయోగశాలలో, కాలానికి ఎదొరెడ్డినిలిచి ప్రజాహృదయాలను గెలిచినవాడు, నిలిచినవాడు.

మారుతున్న కవిత్వానికి మారుతున్న విలువలకు అనుగుణంగా కవిత్వరూపంలో అభివ్యక్తి కూడా మారింది. సమాజంలో మార్పుని కోరిన వైతాళికుడు. పాతరూపంలోంచి కొత్త వస్తువుని, కొత్తవస్తువులోంచి సరికొత్త అభివ్యక్తిని సాధించాడు. భావకవిత్వం ప్రధానంగా భావించే ప్రణయకవిత్వాన్ని నిరసించి మిగిలిన సంఘసంస్కరణ, ప్రకృతి ప్రీతి, స్మృతి వంటిశాఖలను సుసంపన్నచేసి సామాన్యుల సమస్యలు, దళితుల ఆవేదనలకు తన గొంతునిచ్చి స్వయంగా అనుభవించి పలవరించినవాడు. పద్యంద్వారా సంప్రదాయవాదుల గుండెలను కదిలించిన వాడు జాషువా.

కవిగా బాల్యం నుండే పద్యరచన చేస్తున్న భారతి పత్రికను 1924 స్థాపించిన నాటి నుండి రెండుమూడు దశాబ్దాలు కర్ణుడు, కుంతి, గిజిగాడు, సాలీడు, భీష్ముడు, శిశువు, శ్మశానవాటి, క్రీస్తు, భరతమాత, నవభారతం, ఇలా ఎన్నో విషయాలను ఖండికలుగా మలచి ఖండకావ్య ప్రక్రియకు, లఘుకావ్యాలకు ఒక ఒరవడినిచ్చిన కవి జాషువా.

ఆయన కవిత్వంలో కరుణ, వీర రసాలుంటాయని సి.నారాయణరెడ్డి, గంభీర విషాదకావ్యకర్తని జి.వి. సుబ్రహ్మణ్యం వంటి విమర్శకులన్నారు. ఈ ఆధునికాంధ్ర కవిత్వంలో ఆయనకు ఆయనేసాటి భావోద్వేగంలో, శైలిలో ఆయనను వేరేవారితో పోల్చలేము. ఆధార మరెవ్వరికి అబ్బేదికాదు అంటారు.

జాషువా ఎప్పటికీ సాటిలేని మహాకవి. ఆయన కవిత్వం చెక్కుచెదరనిది. చక్కదనాన్ని సంతరించుకుంది. ఆయన తెలుగుపద్యానికి

హృద్యమైనశైలిని సంతరించారు. ఆయనవాణి నిత్య కళ్యాణి, ఆయన బాణి అనన్యసామాన్యమైనది. ఆయన లేఖిని అమృతవాహిణి అని కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి వంటివారు ప్రశంసించారు.

అలాగే నార్ల వెంకటేశ్వరరావుగారు ఒక విప్లవకవిగా, ఆధునిక ఋషిగా ప్రశంసిస్తూ 'గ్రాంధిక భాష వాడిన, పాతఛందోనియమాలు పాటించినా ఇతివృత్తాల్లో, అభిప్రాయాల్లో, కల్పనలో, పోకడలో, సందేశంలో ఆయన విప్లవకవి అని నిర్ధారించారు. ఆయన అనుభూతి, ఆవేశం, భావన, భాషా పాటవంలో కవిత్వంలో అడుగడుగునా ఎదురవుతాయి. వస్తువుకు శైలిని, భాషకు భావాన్ని సాధించి సమన్వయంగా కల్పించే అవినాభావసంబంధం జాషువా ప్రతిపాదంలో సాధించారు.

ఏ ఉద్యమాన్ని ఆలంబన చేసుకోకుండా ఆధునికుల్లో ఉత్తమ కవిత్వంరాసిన ఘనత జాషువాది. ఇంతకవితా శక్తిగల కవి ఆధునికుల్లో లేదు. పద్యకవుల్లో లేదు అందుకే ఆయన యుగకర్త. యుగకర్త తను ఉన్నకాలంలో ప్రకాశిస్తూ గతంలో మంచిని స్వీకరిస్తూ భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేస్తాడు. దాశరథి, కరుణశ్రీ వంటి కవులకు ఖండకావ్య కవులకు ఆదర్శ, అనుసరణీయుడు. ఆయన ప్రభావంబలంగా వారిపైన ఉంది. అలానే 'క్రైస్తవకవులు' బైబులు ఇతివృత్తం స్వీకరించిరాయదానికి ఆద్యుడు జాషువానే. ఎందరో దళితకవులు పద్యకవిత్వం వైపు మరళడానికి బలమైనప్రభావం చూపింది జాషువానే. బీర్నీడి మోషే, కొల్రపాటి జేమ్సు, బీర్నీడి ప్రసన్న, ఎడ్లపల్లి శామ్యేలు, జ్ఞానానందకవి, వంటివారిపై ఆయన ప్రభావం ఉంది.

దినం ప్రజల్ని వేదించే సమస్యల్ని కావ్యవస్తువులుగా స్వీకరించి సమాజపరంగా పురోగామి సాహిత్యాన్ని సృష్టించాడు. మృధుశైలిలో పండితపామరులను ఆనందింపచేసారు. కుందుర్తి వంటివారు అభ్యుదయ కవిత్వబీజాలు ఆయనలో ఉన్నాయి. ఆయన గురజాడకు నిజమైన వారసుడు అంటారు. అనుభూతి, ఆర్ధ్రతను భావ, అభ్యుదయాలనుండి స్వీకరించి ఆయుగాల్లో జీవిస్తూ ప్రత్యేకతను నిలుపుకొని తనముద్రను వేసిన కవి జాషువా మహాకవి.

**జాషువా కావ్యాలు :-** జాషువా రాసిన సాహిత్యాన్ని I. పద్యకావ్యాలు II. గద్యకావ్యాలు III. దృశ్యకావ్యాలుగా విభజించవచ్చు.

**1) పద్యకావ్యాలు** : జాషువా రాసిన సాహిత్యంలో తొంభై శాతంపైగా పద్యకావ్యాలు రాసారు. వీటని 1) ఖండకావ్యాలు 2) లఘుకావ్యాలు అని రెండురకాలుగా విభజించవచ్చు.

"జాషువా" జీవించిన కాలం తెలుగు నేలలో భావకవిత్వం విస్తృతంగా వ్యాపించి ఉంది. ఆయుగ ధర్మం అయిన 'ఖండ'కావ్య ప్రక్రియను గ్రహించి సుసంపన్నం చేసాడు. ఈ ఖండకావ్యాలను ఎ) కావ్య ఖండికలు బి) ఖండ కావ్యాలని రెండు రకాలు.

ఏ) కావ్యఖండికలను మొత్తం ఏడు భాగాలుగా ముద్రించారు. బి) ఖండకావ్యాలు:- 1) అనాథ 2) స్వప్నకథ 3) గబ్బిలం రెండుభాగాలు 4) కాందిశీకుడు 5) నేతాజీ 6) బాపూజీ 7) స్వయం వరం 8) రాష్ట్రపూజ 9) కొత్తలోకం 10) ముసాఫరులు 11) నాగార్జునసాగర్.

**లఘుకావ్యాలు :-** 1) ఫిరదౌసి 2) ముంతాజ్ మహాల్ 3) క్రీస్తుచరిత్ర

II. గద్యకావ్యాలు : 1) కుశలవోపాఖ్యానము 2) చిన్నా నాయకుడు

III దృశ్యకావ్యములు : 1)రుక్మిణీకల్యాణము 2) చిదానందప్రభాము 3) ధ్రువ విజయము 4) మీరాబాయి 5)తెరచాటు

**ఖండ కావ్యాలు :-** తెలుగు సాహిత్యంపై ఆంగ్ల సాహిత్య ప్రభావం, జాతీయోద్యమ ప్రభావం, రాజకీయ, సామాజిక మార్పులవల్ల ఈ ఖండ కావ్యప్రక్రియ 'వికసించింది. 'ఖండిక' అంటే ఏదైన ఒక భావాన్ని గ్రహించి దాన్ని 'ఒకే శీర్షిక'తో సూచిస్తూ వ్యక్తీకరించేది. ఇలాంటి ఖండికలను ఒక కావ్యంగా ముద్రిస్తే అది ఖండకావ్యం. దీనిలో రసంకంటే భావానికే ప్రధాన్యం. ఇవి భావాలని ఆశ్రయించి ఉంటాయి.

ఏదో ఒక అంశాన్ని ప్రధానంగా కవి హృదయంనుండి వ్యక్తీకరించిన భావపరంపరే కావ్యఖండిక. ఇది ఆత్మాశ్రయరీతికి చెందిన ఆంగ్ల లిరిక్‌కి సమానమైంది.

ఒకటి రెండు పాత్రలుండి ఇతివృత్త ప్రాధాన్యం తక్కువవుండి అశ్వాసాలుగా విభజించక రాసిన కావ్యాన్ని 'ఖండకావ్యం' అనవచ్చు.

**జాషువా కావ్యఖండికలు** : విశ్వకవిసామ్రాట్ జాషువా రాసిన కావ్యఖండికలు ఏడుభాగాలను 'జాషువా కృతుల సమాలోచన' అనే పరిశోధనలో డా॥ బి.భాస్కర్ చౌదరి సుమారు పదమూడు అంశాలను గుర్తించి పరిశీలించారు.

1) కవిత్వతత్వ నిర్దేశకాలు 2) స్వీయవృత్త సంబంధాలు 3) దేశభక్తి 4) స్తుతి రూపకాలు 5) స్మృతులు 6) సంఘసంస్కరణ పూరితమైనవి 7) ప్రకృతివర్ణన 8) పర్వదిన ప్రశంసాత్మకాలు 9) ప్రణయ చిత్రణ 10) పౌరాణిక పాత్రలు ప్రశంస 11) అభినందనలు 12) ప్రచారాత్మ కాలు 13) సంకీర్ణాలు.

'మరణంలేని మానవత్వాన్ని కామించు కవితావీణపై నేను మ్రోయించిన వ్యథాతంత్రులే ఖండకావ్యాలు' అన్న జాషువా కవి మాటలు ఆయన రాసిన అసంఖ్యాక ఖండికల్లో వ్యక్తమయింది. ఇవి రాసిలో వాసిలో గుర్తించదగినవి. ఈయన తొలి కవిత 'భారతి' పత్రికలో 1924లో జూన్ 'సంచిక'లో 'కోకిల' ముద్రితమైంది. అప్పటి నుండి అనేక విషయాలు గ్రహించి నలభై 'సంవత్సరాలు' ఈ ప్రక్రియలో కవిత్వం సృష్టించారు. అందుకే సి.నారాయణరెడ్డి గారు ఆధునికాంధ్ర కవిత్వంలో ఖండకావ్య ప్రక్రియ రాయప్రోలుతో పొటమరించినా పుష్పించింది జాషువా కవితలోనే. ఖండకావ్యం రాసి అఖండ ఖ్యాతిని, అఖండ కావ్యస్ఫూర్తిని అందించిన కీర్తి జాషువాకే దక్కింది.

ఏవిధమైన భావాన్నైనా సరళంగా, సుందరంగా ముద్దుల పద్యాల్లో రాసేనేర్పు జాషువాకవికి ఉగ్గుపాలతోనే అబ్బింది. రచన సరళం, శైలి మృధుమధురం. ప్రతిపద్యం ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు తెలుగుదనంతో ఉంటాయి. జాషువాగారి రచనలో జీవంలేని పద్యం ఒకటి కనిపించదు. ఊహాతీత భావాలు వీరిరచనల్లో ఉండవు. గ్రహించిన ఏవిషయమైన అది ఎంత అల్పమైనదైనా తన కవితాశక్తిచే ఉత్కృష్టతని పొందాయి. ఉదాత్తం, సార్వజనీన, ప్రసిద్ధిమైన భావాలు నిమ్నోన్నతులులేని శైలి, సామాన్యజన వ్యవహారంలో నలిగిన పదాలు వాడి తెలుగు వారి హృదయంలో చెరగని ముద్రవేసుకున్నారు.

తనకున్న మానవత, హేతువాద దృష్టి సంఘ సంస్కరణాభిలాష, దేశభక్తి, తెలుగునేలపై ప్రీతి, తెలుగుభాషా సోయగం అంతా జాషువాకవి ప్రత్యేకతను చాటాయి. ఈ ఖండికలన్నీ కులమత, ప్రాంత భేదాల కతీతంగా తెలుగువారి హృదయాల్ని కొల్లగొట్టాయి.

**జాషువా 'నాకథ':–** ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో స్వీయచరిత్ర, జీవిత చరిత్రలనేవి ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులోకి వచ్చినవి. రాజకీయ,సామాజిక, కళాది రంగాలలో విశేష సేవచేసిన కొందరు తమ అనుభవాలను ఈ స్వీయ చరిత్రల ద్వారా వ్యక్తీకరించారు. నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా తన జీవిత కవితా ప్రస్థానాన్ని పద్యకావ్యంగా రాసారు.

దీన్ని "నేను భాషా పరిశ్రమ మిక్కిలి చిన్న వయస్సులో ప్రారంభించి, కవిగా గుర్తింపు ఆదరణలేక పడిన కష్టాలు యథాతథంగా బాలకళాసేవకుల దృష్టికి తీసుకురావాలనే దృష్టి"తో రాసినట్లు 'నాకథ' స్వీయ చరిత్రనుగురించి చెప్పుకున్నారు. దీన్ని నాలుగు భాగాలుగా రాయాలనుకున్నా, మూడు భాగాలలో రాసారు. మూడు భాగాల్లో మొత్తం ఏడువందలకుపైగా పద్యాలున్నాయి.

నా కథ మొదటి భాగంలో తనుపుట్టినప్పటి నుండి ఇరవై సంవత్సరాలు వచ్చేవరకు గల జీవితాన్ని వర్ణించారు. ఇదంతా వినుకొండ చుట్టు తిరుగుతుంది. ఎన్నో అవమానాలు ఆవేదనలతో కడుపుచేత పట్టుకొని అనేక ప్రాంతాలు తిరిగి 'వినుకొండ బోర్డ్ స్కూల్'లో తెలుగు పండితునిగా పనిచేసేంత వరకు ఉంది.

రెండవ భాగంలో జాషువా 'నలభై ఏడేండ్ల' వరకుగల జీవితాన్ని చిత్రించారు. 1942లో పండిట్ ఉద్యోగాన్ని వదలి నెల్లూరులో యుద్ధప్రచార శాఖలో ప్రచార బాధ్యతలో ఉన్నప్పటి నుండి 1966వ సంవత్సరం వరకు తన పోషకులు, ప్రోత్సాహకులు, అభిమానులు సన్మానాలను స్పృశిస్తూ రాసారు. చివరి భాగంలో తనకు జరిగిన సన్మానాలను, బహుమతులను బిరుదులను పేర్కొంటూ సాగింది.

మొదటి భాగం తొలి పద్యం

"ననుగాంచి పెంచి నాలో
గొనబుంగవనమును పాదుకొల్పినతల్లీ!
నను మరచిన నిను మరువను
వినుకొండా! నీకు నా పవిత్ర పణతుల్' అంటూ వినుకొండ ప్రాంతాన్ని కుశల ప్రశ్నలతో ప్రారంభించారు.
అలాగే తను కవిగా ఎదిగిన విధం వర్ణిస్తూ

'ఈదితి వాఙ్మయంబు నిధి నేబది యేడులు సర్వపండితా
మోదముగా రచించితిని ముప్పది కావ్యములిట్టినీవుని
ర్వేదముగల్గు దిఃకృతిలభించెదు దేశములోన నీకు మా
కేది శరణ్యమంచుతల యెత్తక చింతిలెకావ్యకామినుల్' అంటూ దీన్ని ముగించాడు. ఈస్వీయ చరిత్రని 'బొడ్డుప్రకాశం' గారికి అంకితంచేసారు.

**స్వప్నకథ :** జాషువా రాసి ముద్రించిన కావ్యాల్లో మొదటిది. దీన్ని 1934 సంగులో ప్రచురించారు. దీనిలో స్వప్నకథ, అనాథ అనే రెండు శీర్షికలున్నాయి. స్వప్నకథ సమగ్రం, అనాథ అసమగ్రం. "ఒకటి మూటగట్టబడినగాలి యొకటి సలసలగ్రాగిచిందిన కన్నీటి బిందువు. సమకాలీన సమాజంలో సామాన్య మానవుల్ని ఎన్నో సమస్యలు పీడిస్తుంటే భావకవులు "ఊహాప్రేయసుల్ని' ప్రణయ దేవతలుగా చిత్రిస్తున్నపుడు వీరికి భిన్నంగా వీటిని రాసారు జాషువా.

'స్వప్నకథ' భావకవుల స్వప్నంకంటె భిన్నమైంది. సంఘ వంచితురాలైన 'రెడ్డిసాని' కథను విషాదములో నానిన గుండెతోడ గగనానికెక్కించడానికి రాసాడు.

పుట్టుకతో తల్లిదండ్రులను కోల్పోయి, ఒకసాలె స్త్రీతో పెంచబడి, అడుక్కొని బ్రతికే నిరుపేదను ఆదుకోడానికి ముందుకు వచ్చి లోకులనిందకు గురైన రెడ్డిసాని జీవితం ప్రధానం. 'స్వప్నకథ' కావ్యం. చివరకు ఆమె జైలుపాలవుతుంది. మార్వాడీ వర్తకుడు, రాణా, బ్రాహ్మణస్త్రీ వంటి అప్రధాన పాత్రలున్నాయి.

ఈ కావ్యంలో పేదరికాన్ని, దానికి కులమతాలు, సిగ్గు వంటివి ఉండవని నిరూపించారు.

పేదటికము పెద్దవింతశాల / దానిలోన లజ్జ గానబడదు.
ఉదరమొజ్జయగుచు నోరంత ప్రొద్దులు / నోర్మివిద్దె నేర్పుచుండనచట

**అనాథ:** గుండెలు తొలిచే అస్పృశ్యతకు మనిషిని క్రుంగదీసే దారిద్ర్యంతోడయితే ఆవ్యక్తులు ఎంత కుంగిపోతారో వారి స్థితి ఎంత దయనీయంగా ఉంటుందో ఈ అనాథ కావ్యంలో జాషువాకవి వర్ణించారు.

భర్త మరణించగా నడుస్తున్న పీనుగులు వంటి గంపెడు పిల్లలతో, చంకన చంటి పిల్లతో శరీరంపైన కట్టుబట్టతో, సత్తుగాజులతో, జోలెతో నడివీధి పాలైన దళిత మాలస్త్రీ జీవితాన్ని హృదయవిదారంగా చిత్రించారీ 'అనాథ' కావ్యంలో. ఇది ఒక్క అనాథ దళితస్త్రీ కథమాత్రమేకాదు దేశంలోగల కోట్లదళితుల దుస్థితికి ఈదేశంలో జరుగుతున్న సాంఘిక దురన్యాయాలకు "నిమ్న జాతుల కన్నీటి నీరదములు పిడుగులై దేశమును గాల్చి వేయుననుచు" ఒక హెచ్చరికగా వాస్తవిక దృక్పథంతో రాసాడు.

సీ॥ ఎవడారగించు నమృత లోజనంబున /గలి సెనోయీరేమగంజిబువ్వ
ఎవడు వాసము సేయు శృంగార సౌధాన / మునిగెనో యిన్నారి పూరిగుడిసె
ఎవని దేహము మీది ధవాళాంబరములలో / బొసగెనో యిన్నాతి ముదుక పంచె
ఎవడు దేహముసేర్చుమృదుతల్పములలోన / నక్కెనో యీ యమ్మకుక్కిపడక

తే॥ వసుధ పైనున్న భోగ సర్వస్వమునకు / స్వామిత వహించు మనుజుండు ప్రభమందు
నెవడహరించెనేమయ్యో నీమెసుఖము / కలుషమెఱుగని దీని కొడుకుల సుఖంబు" అంటూ వాస్తవికంగా చిత్రించారు.

**గబ్బిలము :** ఆధునిక తెలుగు సాహిత్యంలో మహాకవి, విశ్వకవి సామ్రాట్ 'గుర్రం జాషువా' కవికి కీర్తి ప్రతిష్టలకు నిదర్శనమైన విశిష్టకావ్యం 'గబ్బిలం' దీన్ని రెండు భాగాలుగా రాసారు. మొదటి భాగాన్ని 1941 సంవత్సరంలో కల్లూరి చంద్రమౌళిగారికి అంకితంగా రాసారు.

అంటరానితనంలోని అవమానాన్ని, దారిద్ర్యంలోని బాధను జాషువా ప్రత్యక్షంగా అనుభవించడమేగాక, సోదరులు బంధువులు ఇప్పటికి గుడిసెల్లో ఉంటూ రోజుకూలీలుగా, అర్థాకలితో కనీస గౌరవ మర్యాధలకు నోచుకోక, ఏవిధమైన గుర్తింపులేక బ్రతుకుతున్న వారి బాధలకు, వివక్షకు, అణచివేతకు చిహ్నం ఈ 'గబ్బిల' కావ్యం.

హిందూ సంఘానికిగల అనేక మూఢనమ్మకాల్లో ఒకటి గబ్బిలం అపశకున పక్షి. మృగపక్షిత్వ విచిత్రధర్మాలు కలసిన జీవిగా సమాజం వెలివేసిన అస్పృశ్యజాతికి ప్రతీకగా గబ్బిలాన్ని గ్రహించాడు. దీన్ని రాయటానికి కాళిదాసు 'మేఘసందేశం' ప్రేరణగా భావించాడు. దానితో కథానాయకుడు ప్రణయ సందేశం పంపుతాడు. అతనిశిక్షాకాలపరిమితి ఒక సంవత్సరం. అతడు మన్మదాగ్నితప్తుడు.

'అరుంధతి' సుతుడు ఈ కావ్యనాయకుడు. వీడు 'శివునికి' అశ్రుసందేశంపంపుతాడు. ఇతని శిక్ష అజన్మాంతం ఇతడు క్షుదాగ్ని తప్తుడు ఇద్దరిలో వీడి పరిస్థితి దయనీయం.

తెలుగు సాహిత్యంలో తొలిసారి దళితుల జీవితాన్ని గ్రహించి 'అరుంధతి సుతుడ్ని' అంటరాని వాడ్ని నాయకునిగా ఈ 'గబ్బిలం' కావ్యాన్ని రాసాడు. గబ్బిలం పంచమ జాతికి ప్రతీక. అంటరాని తనం తరతరాలుగా కొనసాగుతున్న అహేతుక మానసిక జాఢ్యం. సాంఘికదురన్యాయం. ఇది ఇలా ఎంతకాలం కొనసాగుతుంది? దళితుల నేరమేంది? అతనికి ఈ శిక్ష ఎందుకూ? వంటిప్రశ్నలు లేవనెత్తి తనగుడిసెలోకి వచ్చిన 'గబ్బిలం'తో శివునికి సందేశం పంపుతూ తన ప్రశ్నలకు సమాధానాలు అడగటం ప్రధానకథ. దీనిలో మొత్తం 117 పద్యాలున్నాయి. ఈ విషయాన్ని వర్ణవ్యవస్థ నిరసన, ఆంధ్రదేశజాతి ఆరాధన అనే రెండు పాయలుగా ఈ కావ్యం సాగింది. ఇందులోని ప్రతి పద్యం భావస్ఫోరకంగా, రసవంతంగా శైలీరమ్యంతో ఉత్తమ స్థాయిలో ఉన్నాయి.

గబ్బిలం కావ్యంలో జాషువాది ఆర్ద్రదృష్టి. కరుణరస భరితమైంది. తన ఆలోచన, తాత్వికత గాంధేయమైన, పోతులూరి వేమనల వలె హేతువాద, మానవతా తత్త్వంతో హైందవ జాతిని నిలదీశారు.

"కర్మసిద్ధాంతమున నోరుకట్టివేసి / స్వార్థలోలురునాభుక్తిననుభవింత్రు
కర్మమననేమొదానికి కక్షయేమొ / యీశ్వరునిచేత ఋజువుచేయింపవమ్మ అంటూ ప్రశ్నిస్తూ కైలాసంలోని శివుణ్ణి కనుక్కురమ్మని గబ్బిలంతో సందేశాన్ని పంపుతాడు.

**గబ్బిలం :** గబ్బిలం రెండవ భాగాన్ని 1946 సంవత్సరంలో గాంధేయవాది 'తిక్కవరపు రామిరెడ్డి' గారికి అంకితంగా తొలిసారి ముద్రించారు. గబ్బిలం కైలాసానికి సందేశం తీసుకుపోయి చాలా కాలమైంది. దానికోసం అరుంధతి సుతుడు ఎదురుచూస్తున్నాడు. వాని సందేశం ఫలితంగా దేశంలో 'గాంధీ' ప్రభావంవల్ల దేవాలయాల ప్రవేశం, హరిజనోద్ధరణ, సర్వసమత్వం వంటివి కనిపిస్తున్నాయి.

గబ్బిలం తిరిగి దర్శనమిస్తుంది. అతడు దానికి స్వాగతమిస్తాడు. అది అతని ఇష్టదేవత, తన జాతికి చిహ్నం. తన జాతికి తీరని వేదనలతోపాటు దేశంలోగల అనైకమత్యం, స్వార్థం, బహుకుల, మతావేశవ్యాధివంటి అనేక సమస్యలు గబ్బిళానికి చెప్పుకున్నవి. వస్తువుగా ఈభాగాన్ని రాసారు. ఈ కావ్యంలో అరుంధతీసుతుని దీనత్వాన్ని చిత్రించే ఆయా సందర్భాలలో కవి ఆత్మీయతాముద్ర స్పష్టంగా కనిపిస్తుంది.

సున్నిత జాషువా హృదయం సోదర అస్పృశ్యుల వేదనలను ఎంత ఆర్ద్రంగా చిత్రించారో అలాగే దేశానికి అనర్థకమైన ధోరణులను అదేస్థాయిలో నిరశించారు.

ఉదాహరణకు :

సీ॥ ఏనాడు మాకావ్య సృష్టికర్తల జిహ్వ / విశ్వసత్యమునాలపింపగలదొ
ఏనాడు మాజాతి దృష్టిమాంధ్యమువాసి / చుట్టుప్రక్కల దేరిచూడగలదొ
ఏనాడు మా బుఙ్డలీజుట్టుతలలేని / పుక్కిటి కథలలో జిక్కువడవొ
ఏనాడు మా విద్యలినుపసంఘమునందు / చిలుముపట్టక ప్రకాశింపగలవొ

తే॥ దనువు దాచక సోమరి తనము మాని / యెన్నడీ మతంబు బిచ్చమెత్తుకొనవొ
అట్టి శుభవేళకై కొంగుబట్టినిలచి / నలిగి వాపోవు చున్నది నా మనస్సు (గబ్బిలం 2-74)

ఈ విధముగా దేశంలోని ఎన్నో సమస్యలను సామాజిక, రాజకీయ స్థితులను, సంఘ విద్రోహులు, కుహనా మతస్థులు, దేశద్రోహులను నిరసిస్తూ రాసాడు. ఈరెండు భాగాలు భూతవర్తమాన కాల భారత సమాజ స్థితికి దర్పణాలు.

**కాందిశీకుడు :** జాషువా 1942-1945 మధ్యకాలంలో నెల్లూరు, మద్రాసు ప్రాంతాలలో 'యుద్ధ' ప్రచారకునిగా పనిచేసి ప్రత్యక్షంగా యుద్ధ ఘోషని ఆలకించాడు. ఆయుద్ధంవల్ల నిష్కారణంగా నిరపరాధులు మరణించడాన్ని నిరసిస్తూ 'శాంతి' అహింసల ఆవశ్యకతని ఆశిస్తూ ఈ కావ్యాన్ని తిక్కవరపు రామిరెడ్డి భార్య 'సుదర్శనాంబ' ఆత్మకు అంకితంగా (1945) రాసారు.

ఒక బర్మా 'కాందిశీకుడు' ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని అడవిలో కొండలు, కోనల్లో తిరుగుతూ చీకట్లో చిక్కుకొని తన కష్టాలను తలచుకుంటాడు. అప్పుడు అతని కాలికి ఒక ఒక బౌద్ధ బిక్షువు కపాలం తగులుతుంది. భయంతో వణుకుతున్న అతనితో కపాలం సాగించిన సంభాషణే ఇతివృత్తంగా గలకావ్యం 'కాందిశీకుడు'.

దీనిలో యుద్ధం ముగిసి 'శాంతి, అహింసలు' విలసిల్లాలని స్వార్థరహిత రాజ్యం, విశ్వసౌభ్రాతృత్వాన్ని కాంక్షించారు.

**స్వయం వరం :** ఈ 'స్వయంవరం' కావ్యాన్ని దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జాషువా రాసారు. దేశంలో రాజకీయా, సామాజిక పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దేశవిభజన హిందూ, ముస్లిం కొట్లాటలు, గాంధీహత్య, అవినీత, అరాచకత్వం, కులతత్వం, మతతత్వం పెచ్చరిల్లి జాషువా కవిని ఆవేదనకు గురిచేసాయి. గాంధీసిద్ధాంతాలకు నిరాదరణ, స్వాతంత్ర్య శిశువు బాలరిష్టాలకు గురి అయిన సందర్భంలో స్పందనగా రాసిన కావ్యం స్వయంవరం. దీన్ని తిక్కవరపు రామిరెడ్డిగారికి అంకితంగా 1950 సంవత్సరంలో రాసారు.

సీ॥ సమరసభావనిశ్చల పరిశ్రమకు బ్ర / హ్మాండంబు లున్ముఖంబయినదాక
వ్యత్యయంబైన తీవ్రాస్పృశ్యతాజాడ్య /మన్నివిధాల రూపటిన దాక
నాజాతి నాయూరు నాదేశమని పొంగు / స్వాభిమానము శూన్యమయినదాక
విశ్వసౌభ్రాత్రంబు వెలయించు నైఖ్య సం/ఘూవ్యాప్తి దిశల పెంపారుదాక

తే॥ జ్ఞానమత సాంఘిక స్వేచ్ఛనల్పురకును / నేకరీతి లాభించునందాకరాదు
భావిభారత కళ్యాణ పరమ సుఖము / కాక చల్లారదెపుడు సంగ్రామమఖము

అంటూ జాతిలోని సంకుచితతత్వాన్ని నిరసించారు. (కాందిశీకుడు - 110)

ఈ రాష్ట్రంలో వరులు ప్రజలు, వధువు స్వరాజ్యం. మహాత్ముని సత్యాగ్రహ యజ్ఞంలో స్వరాజ్యబాల పుడుతుంది. ఫలితంగా బాపూజీ ఆత్మబలి అయ్యారు. ఆయన ప్రతిమలు ప్రతి పల్లెల్లో, పట్టణాల్లో ప్రతిష్టించారు. స్వరాజ్యబాల పెరిగింది. 'స్వయంవరానికి ధనిక, పేద,

నీతి, అవినీతి భేదాలు లేక అందరూ వచ్చారు. సత్య, అహింసలు ఆమె చెలికత్తెలు. తగినవరులు రాక ఆమె ఏడ్చి సభ వదలి వరునికోసం దేశంలో వెతుకుతుంది. చివరికి ఒక 'బోయపల్లెలోని' యువకుడిని మహాత్ముని ఉపదేశం మేరకు పెళ్ళి చేసుకొని రాజ్యపాలన చేయడాన్ని కథగా కల్పించి రాసిన కావ్యం స్వయంవరం. దీనిలో బాల్యం, స్వయంవరం, దేశాటనం, హిమగిరి యాత్ర అనే నాలుగు ఖండాలున్నాయి. దీనిలో గాంధీతత్వం పట్ల, నాయకత్వంపట్ల జాషువాకవి అచంచల విశ్వాసాన్ని వ్యక్తీకరించారు.

**కొత్తలోకం :** ఈ కొత్తలోకం' కావ్యం జాషువా గారికి వయస్సుతో పాటు ఆలోచనల్లోవచ్చిన పరిణామానికి, విప్లవాత్మక భావాలకి నిదర్శనం. దేశారాధన ప్రాచీన భారత కళాసాహిత్యాలస్మరణ, దళితజనోద్ధారణ, వర్తమాన రాజకీయాల నుంచి దేవునిమీదకి తనదృష్టిని మళ్ళించి రాసాడు. దీన్ని '1956'లో తన భార్య 'మేరి'గారికి అంకితం చేసాడు.

సమాజంలోని సకల సమస్యలకు కారణం ఎవరు? ఈ అవకతవకల సృష్టి ఎందుకు చెయ్యాలి? దేవుడు అనేశక్తి ఉందా? దేవుని అస్తిత్వమేది? వీటికి ఆయన బాధ్యత ఎంత? మొదలైన ప్రశ్నల నేపథ్యం నుంచి ఈ కావ్యం పుట్టింది. దీంట్లో 1) వ్యత్యయం 2) తొలికోర్కె 3) మలికోర్కె అనే మూడు భాగాలున్నాయి.

మొదటి భాగంలో రాజుకవుల స్వభావాలను పోలుస్తూ "రాజుచేతికత్తిరక్తంబు వర్షించు /సుకవి చేతికలము సుధలు గురియు / అతడేలగలుగు యావత్ప్రపంచంబు / నీతడేలగలుగు ఇహము పరము" అంటూ వారిలోని వ్యత్యాసాన్ని చర్చించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ భాషా ప్రయుక్తరాష్ట్రంగా ఏర్పడటాన్ని, నాగార్జునసాగర్ బహుళార్థ సార్థక ప్రాజెక్టు గొప్పదనాన్ని కీర్తించాడు. బౌద్ధ ధర్మ ప్రాధాన్యతని, హేతువాద మానవతా వాదాన్ని చిత్రించారు.

తొలికోర్కె, మలి కోర్కెలలో భగవంతుని అస్తిత్వాన్ని ప్రశ్నిస్తాడు. మూడోభాగంలో తన భార్యను 'మధుర హృదయం'గా చిత్రించారు. ఈ కావ్యం చివర కవి, శిల్పి, ముస్లిం దంపతులు, విధవరాలు, శాస్త్రజ్ఞుడు మొదలైన శీర్షికలతో ఖండికలను చేర్చారు.

**ముసాఫరులు :** దీన్ని 1963లో సానికొమ్ము మాలకొండారెడ్డిగారికి అంకితంగా రాసారు. 'ముసాఫర్' అనే ఉర్దూపదాన్ని' ముసాఫరులు అనే తత్సమ తెలుగు పదంగా జాషువాగారు వాడారు. దీనికి ప్రయాణికులు అని అర్థం. దీన్ని లౌకిక, తాత్వికార్థంలో ఉపయోగించారు. సృష్టికి కారణమైన మూలశక్తి అజ్ఞాతలోకాల్లో ఉంటూ చిన్న ప్రాణాల్ని లోకంలోకి నెడితే అవి పిండాకృతిని పొంది తల్లి గర్భంలో పెరిగి భూమి మీదది పుట్టడం, గిట్టడం వంటి భావాలు ఆధారంగా 'కల్పిత'కథలో ఈ కావ్యాన్ని రాసాడు.

ఒక యుద్ధ వీరుడు మరణించి అనంతలోకాలకు పోతూ ఉంటే భూమిమీద పుట్టబోయే ఇంకో ఆత్మభూమివైపు వస్తూ మార్గమధ్యలో కలసి మాట్లాడుకున్న సంబాషణే ఈకావ్య ఇతివృత్తం.

యోధుని ఆత్మ పుట్టబోవు ఆత్మకు భూమిలోని విశేషాలను కులమత దురంహాకారాలను, మూఢనమ్మకాలను, పిసినారితనం వంటి ఎన్నో ఉంటాయి జాగ్రత్త అని హెచ్చరించే హేతువాద, మనవతా భావజాలం వెల్లువైంది.

మతపిచ్చిముదిరి యన్యుల మతము న్నిరసించి స్వీయమతగౌరవమున్
హతమార్చినిత్యకలహము / ప్రతిఫలముగ దెచ్చుకొనెడు వారుందురటన్

పూర్వసంప్రదాయములకు దేవతలకు / వెఱ్ఱినమ్మకాల విస్మృతులకు
చావులేని విద్యచదివింత్రు తద్భిన్న /మైన చదువు సంధ్యలతకవచట

పసితనమునందు హృదయము / కుసుమము వలె పరిమళించు గుణగణములునిం
పెసలారుచుందునాదశ/ ముసలితనంబునకు గల్గ ముక్తి ఘటించున్ ను వంటి ఎన్నో సత్యబోధిత మధుర పద్యాలున్నాయి.

**బాపూజీ :** 30-01-1948 నాడు గాంధీ మహాత్ముడు తుపాకి గుండ్లకు బలిమయిన రోజు. భారతదేశమంతా విషాదంలో కూరుకుపోయింది. భారతీయ హృదయాలు ద్రవించాయి. "భారత గర్భకుహరిన కత్తులాడించిన బాపూజీ మరణవర్తా' 'విశ్వంభర నేత్రమే చెమ్మగిల్లినది" అంటూ జాషువా కవి బాపూజీ మరణాన్ని స్మృతికావ్యంగా సుమారుగా 112 పద్యాలలో రాసారు. దీన్ని గాంధేయవాది, దేశభక్తుడైన తిక్కవరపు రామిరెడ్డి గారికి అంకితం చేసారు. కావ్యం మొత్తం ఆయన మరణానికి శోకతప్తహృదయ నీరాజనాలిచ్చినా అంతర్లీనంగా జాతీయోద్యమానికి, సహాయనిరాకరణ, క్విట్ ఇండియా, ఉద్యమాల్లో ఆయన పాత్రను నాయకత్వాన్ని కొనియాడారు. జాషువాను గాంధీతత్వం సమన్వయ ప్రయోజన ఆచరణశీలం బాగా ప్రభావితం చేసింది. అందుకే 'లోకమోహన సబర్మతి సన్మునికింగుమారుడను' మహాత్ముని చెప్పులజాడలోన కాలాడచరించెదనని ప్రకటించాడు.

గాంధీజి సత్యా అహింసలు, శాంతి కాముకత్వం, ఆయన జీవిత ఆదర్శాలను ఇందులో వర్ణించాడు.

**నేతాజీ :**భారత జాతీయోద్యమంలో గాంధీ సత్యం, అహింస సిద్ధాంతాలకు భిన్నంగా ఆంగ్లేయుల మీదకు 'అజాద్ హింద్ పౌజును' నడిపించిన సుభాసు చంద్రబోసు వీరోచిత జీవితాన్ని వీరరస ప్రధానకావ్యంగా 'వంగసింహంబు' అంటూ రాసారు. దీనిలో 'అంజలి,

కన్నతండ్రి, తొలినిట్టూర్పు, మలినిట్టూర్పు' అంటూ నాలుగు భాగాలలో నూట నలభై మూడు (143) పద్యాలలో ఆయన జీవితాన్ని ఆదర్శప్రాయంగా ఆవిష్కరించారు.

**రాష్ట్రపూజ :** తెలుగువారి చిరకాల వాంఛ అయిన ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భంగా 1953లో ముప్పైఐదుపద్యాలలో రాసారు. దీనిలో బ్రిటీష్ పాలనలోని తెలుగువారి రాష్ట్ర ఏర్పాటుదాని కోసం పొట్టి శ్రీరాములుగారి ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణాలను వదలటం,టంగుటూరి ప్రకాశం పంతులు, వంటి త్యాగధనుల ప్రశంస, రాష్ట్ర రాజధాని విషయంలో జరిగిన ఘర్షణ వంటి విషయాలతో రాసాడు. ఆంధ్రభిమానం, జాతీయభావాలు జమిలిగా ఇందులో కనిపిస్తాయి. భారతీయ మానవత్వమునకు / బ్రతుకుదెరువు చూపిపాలించు కొనుమమ్ము / విశ్వవినుత రాష్ట్ర వీరనారి" అంటాడు.

**నాగార్జున సాగర్ :** తెలుగునేలలోని బహుళార్థ సార్థక ప్రాజెక్టు నాగార్జునసాగర్ నిర్మాణ ప్రచారకావ్యం ప్రభుత్వ ప్రోత్సాహంతో 1966వ సంవత్సరంలో రాసాడు. దీన్ని పౌరసంబంధాలశాఖ ప్రచురించింది. ఈ నిర్మాణం ఆంధ్రప్రదేశ్ తెలుగుజాతి బౌద్ధిక, భౌతికంగా సాధించిన ప్రగతిగా, నాగార్జునాచార్యుని పేరుతో వెలిసిన తీరును వర్ణించారు.

**జాషువా లఘుకావ్యాలు :** ఆధునిక ఖండిక సంపుటాలకు భిన్నమైనవి. ఖంఢకావ్యాలు, ప్రాచీన పురాణ, ఇతిహాస ప్రబంధాలకు, కావ్యాలకన్నాతక్కువ పరిధిగల కథలు గ్రహించి వచ్చిన కావ్యాలను ఖండకావ్యాలు అన్నారు విమర్శకులు. వీటిలో ఇతివృత్తానికి నవ్యభావాలకి సమప్రాధాన్యం ఉంటుంది. వీటిలో వర్ణనల విస్తృతి తక్కువ సన్నివేశాలకల్పన సజీవపాత్ర చిత్రణ గలవే జాషువా లఘుకావ్యాలు.

ఈ విభాగంలో పిరదౌసి, ముంతాజ్‌మహల్, క్రీస్తుచరిత్ర, అనే మూడు రచనలున్నాయి. మొదటిరెండు చారిత్రక కథలు మూడోది బైబిల్ ఆధారంగా రాసింది.

**ఫిరదౌసి :** 'ఫిరదౌసి' అనే పారశీక పదానికి 'స్వర్గం' అని అర్థం. స్వర్గ సుఖానందాన్ని తన సృజనశక్తి ద్వారా సృష్టించిన 'అబ్దుల్ ఖాసింమన్సూర్' అనే కవిని 'పిరదౌసి' అని పారశీక ప్రజలు పిలుచుకున్నారు. ఈయన క్రీ.శ. 935 ప్రాంతంలో తూసు పట్టణంలో జీవించాడు. ఆరోజుల్లో గజనీ మహమ్మద్ పాలన చేస్తున్న రోజులు. ఆకవి జీవితాన్ని ప్రధానంగా నాలుగు అశ్వాసాల్లో 'నూటడెబ్బై పద్యాలలో కరుణరస భరితంగా జాషువాకవి రాసాడు. దీన్ని వినుకొండ హైస్కూల్ హెడ్‌మాస్టార్ 'సింగరాజు మల్లవపురాజారావు' గారి కోరిక మేరకు వారి తండ్రి లక్ష్మినారాయణగారికి అంకితం చేసాడు. 1932లో ఇదితొలి ముద్రణ పొందింది.

గజినీమహమ్మద్ పారశీక కవుల్లో శ్రేష్టుడైన పిరదౌసిని పిలిపించి 'పారశీకరాజ చరిత్రని' రాసివ్వమని ఒక్కో పద్యానికి. ఒక బంగార దీనారం' ఇస్తానని పురమాయిస్తాడు. కవి దానికోసం ముప్పైసంవత్సరాలు కష్టపడి "షానామా' పేరుతో రాసి, రాజసభలో పండితుల మధ్య వినిపిస్తాడు. రాజు మాత్రం మాట తప్పి వెండినాణాలనిస్తాడు. తను దగాపడినట్లు దు:ఖంతో రాజులని నిందిస్తూ పద్యాలురాసి వెండినాణాలను తిరస్కరిస్తూ పంపుతాడు. రాజు దానికి కోపంతో కవిని చంపమని ఆజ్ఞాపిస్తాడు. పిరదౌసి తన భార్యాబిడ్డలతో తన స్వగ్రామం తూసు పట్టణం చేరి తలదాచుకుంటాడు. తర్వాత రాజు 'పిరదౌసి' కవితా మాధుర్యంతెలిసి పదివేల బంగారు దీనారాలను పంపుతాడు. ఆ ధనం తూసు పట్టణంలోకి ప్రవేశించేపుడే కవి మరణించి స్మశానానికి తీసుకుపోతుంటారు. ఆయనకూతురిని సొమ్ము తీసుకోమంటే తనతండ్రి మరణానికి కారణమైన ధనంవద్దని తిరస్కరిస్తుంది. రాజు కవిపేర సత్రాన్ని పట్టణంలో నిర్మిస్తాడు. ఈ హృదయవిదారకథని గ్రహించి కరుణరస పూరకంగా పాఠకుల హృదయాలు ద్రవించేట్లు జాషువాకవి ఈకావ్యాన్ని రాసారు.

**ముంతాజమహలు :** మొఘలాయి పాదుషా షాజహాన్ బేగం సాహెబ్‌ల ప్రణయ దాంపత్యాన్ని ఇతివృత్తంగా తీసుకొని రాసిన చారిత్రక కావ్యం 'ముంతాజుమహల్' దీన్ని తనతల్లిలింగమ్మగారికి జాషువా అంకితం చేసారు.

షాజహాన్, బేగం సాహెబ్‌లకు వివాహమై పంతొమ్మిది సంవత్సరాలు సంసార మాధుర్యాన్ని అనుభవించిన తర్వాత, ముంతాజ్‌కి పద్నాల్గవ గర్భం' వస్తుంది. ఆమెకు నిద్రలో తన గర్భంలోని పిండం నవ్వినట్లు కలవస్తుంది. అది అశుభనంగా ఆమె భావిస్తుంది. తన సంతానం తల్లి వేరైనట్లు, తనకు ఒక గొప్ప సమాధి కట్టినట్లు కల వస్తుంది. ఆమెకలగన్నట్లే ఆమె భర్త చేతిలో మరణిస్తుంది. ఆమె జ్ఞాపకార్థం నిర్మించాలనుకున్న సమాధి నఖళ్ళుఎన్నో తెప్పించి ఏవి నచ్చక తిరస్కరిస్తాడు. కాని ఒక పిచ్చివాడు తన భార్య మృతికి చిహ్నంగా ఒక నమూనా చేసుకుంటాడు. అది చూసి పాదుషా నచ్చి బంగారు నాణాలిస్తాడు. వాటినివాడు తిరస్కరించి వెళ్ళిపోయాడు. ఆ నాణాలను ఫకీరులకు పంచిపెట్టి వాని నమూనాతో యమునానది తీరంలో ఇరవైవేలమంది ఇరవైరెండు సంవత్సరాలు కష్టపడి ముంతాజ్‌మహల్ నిర్మిస్తారు. ఆమెమరణం తర్వాత ముప్పైఐదు సంవత్సరాలు ఆమె జ్ఞాపకాలతో ఏకపత్నీవ్రతుడుగా ఆదర్శ జీవితం గడుపుతాడు. వీరిలోకోత్తరమైన దాంపత్య గాథకు జాషువా దివిటిపట్టి ఈకావ్యంద్వారా శాశ్వతీకరించాడు.

ప్రథిత సంసార రాజమార్గమునడని / దంపతులకెల్ల నద్భుతాదర్శమగుచు
జగతునలరించె నయ్యాలు మగలచెలిమి / అంటూ వారి ఆదర్శ దాంపత్యాన్ని చిత్రించారు

**క్రీస్తు చరిత్ర :** జాషువా బాల్యం చుట్టూ ఉన్న వాడల జీవితం మొత్తం క్రైస్తవంతో కూడుకుంది. ఇంట్లో తల్లిదండ్రులు ఇద్దరు క్రైస్తవ మతప్రచారకులు. బాల్యంలో చర్చిలో బైబిలు పఠనం నిత్యపారాయణం, ఎప్పటినుండో 'బైబిలుని' కథలను కావ్యాలుగా రాయాలన్న జాషువా చిరకాల కోరిక 1963లో క్రీస్తుచరిత్ర ప్రచురించడంతో తీరింది.

బైబుల్‌లోని కొత్తనిబంధనలోగల మత్తయి, మార్కు, లూకా, యోహాను, సువార్తలను ఆధారంగా ఏసుక్రీస్తు జీవితాన్ని ప్రవచనాలని సమన్వయపరస్తూ క్రీస్తుమత స్థాపకుడుగా ప్రచారకుడుగా ఆయన జీవితం, సూచక క్రియలు, శిష్యులను చేర్చుకొని చేసిన బోధనలు చివరకు రోమను సామ్రాజ్యం క్రీస్తును శిలువవేసిన కరుణామయ జీవితాన్ని శాంతి, కరుణారసిపూర్వకంగా రాసాడు.

**గద్యకావ్యాలు :** 1) కుశలవోపాఖ్యానం. ఈయన తొలి రోజుల్లో గుంటూరు టీచర్ ట్రైనింగ్ పాఠశాలలో తెలుగు పండితునిగా పనిచేస్తున్నప్పుడు 1922 సంవత్సరంలో 'కుశలవోపాఖ్యానము' అనే పద్యకావ్యాన్ని రాసారు. దీనికి మూలం పిల్లల మర్రి పినవీరభద్రుని జైమిని భారతం, కంకటిపాపరాజు ఉత్తర రామచరితం అనేవి. రాముడు తండ్రి ఆజ్ఞతో పద్నాల్గు సంవత్సరాలు అరణ్యవాసంచేసి, రావణ, కుంభకర్ణాది రాక్షసులను సంహరించి అయోధ్యకు వచ్చి పట్టాభిషేకం చేసుకొని పరిపాలించన విధం, సీతకోరిక మేరకు లక్ష్మణునితో వాల్మీకి ఆశ్రయంలో శాశ్వితంగా వదిలివేయడం, కుశలవుల పుట్టుక చివరికి సీత రసాతలానికి చేరటం వంటి విశేషాలతో ప్రాచీనపురాణ ఇతిహాసకథను గ్రహించి ఈ కావ్యాన్ని జాషువా రాసారు.

**2) చిన్నా నాయకుడు :** జాషువా దీనిని 1948వ సంవత్సరంలోతొలిసారి ప్రచురించారు. ఇది జాషువా స్థానిక చరిత్ర ఆధారంగా రాసిన నవల. దీనిలోని నాయకుడు 'చిన్నా నాయకుడు' చెంచువీరుడు. 'పల్నాడుకు చెందిన వీరుడు' కన్నమదాసు. స్థావరం బొల్లాపల్లి. ఈయనదాష్ట్యానికి గురైన చెంచుకుటుంబానికి చెందినవాడు. చిన్నానాయుడు ఎలానో తప్పించుకొని వినకొండకు చెందిన ధనశెట్టి ఆదరణలో పశువులకాపరిగా కుదురుకుంటాడు. ఏకలవ్యుడిలా విలువిద్యను నేర్చుకుంటాడు. దీనిశెట్టి భార్య అనితల్లి వీరికూతురి చుక్కమ్మ. గుండారాయని వారి దూరపు చుట్టం సుధాదేవి కన్నమదాసు చెర నుండి బయటపడి 'ధనశెట్టి' ఇంట్లో తలదాచుకుంటుంది. గురుమూర్తి సమాచారంతో కన్నమదాసు తన అనుచరులతో దాడిచేయిస్తాడు. కాని వాళ్ళు చిన్నమనాయకుని చేతిలో చస్తారు. తర్వాత ధనశెట్టి తన కూతురు పెళ్ళికోసం వెళుతున్న బళ్ళపై కన్నదాసుదాడి చేసినప్పుడు చిన్నమనాయకుని చేతిలో చనిపోతాడు.

ఈ కథని రాయడానికి ప్రధానకారణం యువకుల్లో వీర బీజాలతో పాటు సంఘసంస్కరణబీజాలు నాటడం – సంఘంలోని జంతుబలులు, దొంగపూజారులు, వంటి మూఢనమ్మకాలు మధ్యపానం, కోడిపందాలు, వంటి జూదాలను మెట్టవేదాంతాన్ని ఖండించడం లక్ష్యంగా గద్యంలో రాసారు.

ఈ విధంగా జాషువా ఎన్నో వైవిధ్యమైన ఇతివృత్తాలను తీసుకొని తన కావ్యాలను రాసారు. కవిగా పరిపక్వత చెందేకొద్దీ వస్తుస్వీకరణలో విప్లవాత్మకతను బ్రహ్మణీయ హైందవ వర్ణకుల వ్యవస్థ నిరసనను 'స్పష్టంగా ప్రకటించాడు' 'నవయుగకవి చక్రవర్తిగా, తెలుగు సాహిత్య చరిత్రపై తనదైన ముద్రవేసిన మహాకవి 'గుర్రంజాషువా'.

**ఆధార గ్రంథాలు :**

1) జాషువా కృతులు – 1 నుండి 5 సంపుటాలు
2) సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు – జి.వి. సుబ్రహ్మణ్యం
3) తెలుగు సాహిత్య సమీక్ష – జి. నాగయ్య
4) వ్యాసప్రపంచం 3సం. – కొడవటిగంటికుటుంబరావు
5) జాషువా కృతులుసమాలోచన – డా॥ బి. భాస్కర చౌదరి